

వీధి కుక్కలకు వైద్యం అందించండి

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : చర్మవ్యాధుల బారినపడిన వీధి కుక్కలకు అవసరమైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పాడేరు మండలంలోని వెటర్నరీ అధికారులు, అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. పశువుల ఆసుపత్రులలో అందుబాటులో ఉన్న మందుల నిల్వలపై అడిగి తెలుసుకున్నారు. చర్మవ్యాధులు, ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్న వీధి కుక్కల వైద్యానికి అవసరమైన మందుల కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ముందుగా పాడేరు మండలంలో వీధికుక్కలకు వైద్యం అందించిన తర్వాత మిగతా మండలాల్లో అమలు చేస్తామన్నారు. సమావేశంలో వంట్లమామిడి, హుకుంపేట వెటర్నరీ డాక్టర్లు రాజీవ్ కిషోర్, చరణ్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ రమణ పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ ధ్రువపత్రాల పంపిణీ



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి రోషిణి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: రెండు దఫాలుగా టైలరింగ్‌లో శిక్షణ పొందిన 40మంది గిరిజన మహిళలకు మంగళవారం అరకువేలి మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. బెంగుళూరు ఎఫ్‌విటిఆర్‌ఎస్ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన మహిళల టైలరింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. అరకువేలీ జెడ్‌పిటిసి శెట్టి రోషిణి పెదలబుడు- 2 ఎంపిటిసి దూరియా ఆనంద్‌కుమార్, వైసిపి నేత కమిడి అశోక్, ఐద్వా రాష్ట్ర నేత వి.జయ పాల్గొని, శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఈసందర్భంగా జెడ్‌పిటిసి రోషిణి మాట్లాడుతూ గిరిజన మహిళలకు స్వయంఉపాధికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎఫ్‌విటిఆర్‌ఎస్ సంస్థకు అభినందనలు తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఇటు వంటి కార్యక్రమలు మరెన్నో చేయాలని, తాము అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ఎంపిటిసి దురియ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని గిరిజన మహిళలకు సూచించారు..మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి వి జయ మాట్లాడుతూ, గిరిజన మహిళలకు మంచి అవకాశాలు కల్పిస్తున్న ఎఫ్‌విటిఆర్‌ఎస్ సంస్థను, ఫీల్డ్ కన్సల్టెన్నీ బుద్ధరాజును అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ దీసరి బుద్ధరాజు, ఒకేషనల్ టీచర్ శాంతి కుమారి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వే నిర్వహించి భూసమస్య పరిష్కరించండి

జెడ్‌పిటిసి దీసరి గంగరాజు

రెవెన్యూ, సర్వే అధికారులతో చిమిడిపల్లిలో సిపిఎం బృందం సందర్శన


అధికారులతో సమస్యలపై చర్చిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి : అటవీ, రెవెన్యూ అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించి భూ సమస్యను తక్షణమే పరిష్కరించాలని జెడ్‌పిటిసి దీసరి గంగరాజు సూచించారు. మంగళవారం మండలంలోని నాన్ షెడ్యూల్డ్‌ఏరియా భీంపోలు పంచాయతీ చిమిడిపల్లి గ్రామంలో అధికారులతో కలిసి సిపిఎం బృందం గ్రామాన్ని సందర్శించింది. సాగు రైతులతో జెడ్‌పిటి గంగరాజు ఆధ్వర్యంలో జిల్లా సర్వేయర్ కృష్ణమోహన్, మండల రెవెన్యూ సిబ్బంది సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ పదేళ్లుగా, రైతులు, భూస్వాములకు మధ్య భూముల సరిహద్దు విషయమై వివాదంరేగుతోందన్నారు. సర్వే నెంబరు 50, 55లో భూస్వామికి చెందిన భూములుండగా, సర్వే నెంబర్ 61లో గ్రామానికి ఆనుకొని ప్రభుత్వ భూములను పూర్వకాలం నుంచి రైతులు సాగు చేస్తున్నారన్నారు. ఇపుడు గిరిజన రైతుల సాగులో ఉన్న భూమి తనదంటూ భూస్వామి సతీష్ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. వివాదం పరిష్కారానికి అటవీ, రెవెన్యూ అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించి, ఆయా భూముల సరిహద్దులనుగుర్తించి వేరుచేయడం ద్వారా వివాదానికి ముగింపు పలకాలని గంగరాజు సూచించారు. రైతులకు అన్యాయం జరిగితే ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. రైతులపై కేసులు పెట్టి, కోర్టుల చుట్టూ తిప్పించడం సరికాదని, తక్షణమే భూస్వామి పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లా సర్వేయర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ చిమిడిపల్లి గ్రామంలో గిరిజనులు, భూస్వాముల నెలకొన్న భూవివాదంపై పరిశీలనకు కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చామన్నారు. సర్వేనెంబరు 50.55లో రెవిన్యూ ఫారెస్ట్ జాయింట్ సర్వే నిర్వహించి హద్దులను చూపిస్తామన్నారు. కార్యక్రమంలో టోకూరు సర్పంచ్, సిపిఎం నేత కిల్లో. మొస్య, సిపిఎం మండల కార్యదర్శి. ఎస్.నాగులు, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు జె.సుబ్బారావు, భీంపోలు ఎంపిటిసి. అశోక్, ఉపసర్పంచ్ అప్పలకొండ, మండల రెవెన్యూ సర్వేయరు దాసు, విఆర్ఒ నంద గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిసిఎఫ్ శ్రీకాంత్‌నాథరెడ్డి

అటవీ సంపదను సంరక్షించాలి

- అల్లూరి జిల్లా సిసిఎఫ్ శ్రీకాంత్‌నాథరెడ్డి

ప్రజాశక్తి -సీలేరు

ఏజెన్సీలోని అటవీ సంపదను సంరక్షించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (సిసిఎఫ్) శ్రీకాంత్‌నాథరెడ్డి రేంజ్ అధికారి శ్రీనివాస్‌ను ఆదేశించారు. జీకే వీధి మండలం సీలేరు అటవీ రేంజ్ పరిధిలో మంగళవారం బీటు తనిఖీలు విస్తృతంగా చేపట్టారు. స్థానిక అటవీశాఖ కలప డిపోలో టేకు దుంగలు వేలంపాటలో సిసిఎఫ్ శ్రీకాంత్‌నాథ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీలేరు అటవీశాఖ కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం కాలుష్య నివారణపై సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. అటవీ సంపద దొంగలపాల కాకుండా కట్టుదట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అటవీ సంపదను ఎక్కువగా పెంచడం వలన పర్యావరణానికి ఎంతగానో దోహదపడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సూర్యనారాయణ, సబ్ డిఎఫ్ఓ ఎన్ఎస్‌బి రాజు, దారకొండ ఎఫ్ఎస్ఓలు సతీష్, వివేకానందరావు సిబ్బంది పాల్గొన్నారు.

11న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ : బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాల్లో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానం, మన్యంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల అనుమతుల రద్దు, జిఒ 3ను పునరుద్ధరించి చట్టబద్ధత కల్పించడం, ఇతర సమస్యల పరిష్కారాన్ని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11న చలో కలెక్టరేట్ ఆందోళనను జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు బోండా సన్నిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం పెదబయలు మండల గిరిజన సంఘం కార్యాలయం వద్ద 11న చలో కలెక్టరేట్ పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సన్నిబాబు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఉన్న అటవీసంపదను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉబలాటపడుతున్నాయని మండిపడ్డారు. నూతన అటవీ పాలసీ తీసుకొచ్చి బడా కార్పొరేట్ కంపెనీలకు, అంబానీ, ఆదానిలకు అడవులను ధారదత్తం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. చింతపల్లి ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్, అనంతగిరి మండలం నిమ్మలపాడు గ్రానైట్ మైనింగ్ ప్రయివేటుకు కట్టబెట్టాలన్న పాలకుల నిర్ణయాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు బిసి'ఎ'లో ఉన్న. బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేరిస్తే, నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతుందని, వెంటనే దాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 11న పాడేరు కలెక్టరేట్ వద్ద.గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాలో గిరిజన, మేధావులు ఉద్యోగులు, యువకులు, గిరిజన ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె పృథ్వీరాజు, గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు బోండా గంగాధరం, జె.సునీల్, సిహెచ్. రామారావు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గిరిజన వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 11న నిర్వహించే చలో కలెక్టరేట్ ఆందోళన జయప్రదం చేయా గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జి బుజ్జిబాబు, పి రామన్న డిమాండ్ చేశారు. లని మంగళవారం అరకువేలి గిరిజన సంఘం భవనంలో చలో కలెక్టరేట్ పోస్టర్లను గిరిజన సంఘం నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు టి జోగుల్, కె ప్రసాద్ పాల్గొన్నారు.





పెదబయలు, అరకు వేలీలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నేతలు

జాబ్ కార్డు ఉన్నవారందరికీ ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలోని ఉపాధి హామీ చట్టం జాబ్ కార్డులు ఉన్న ప్రతి వ్యక్తికి ఉపాధి హామీ పనులు కల్పించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మారేడుమిల్లి, వై రామవరం మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ ఏపిడి, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎఫ్ఏలతో పిఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డులు ఉన్న ప్రతి వ్యక్తికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి పనులు కల్పించాల్సి ఉందని తెలిపారు. ఉపాధి పనులు కావలసిన వారికి రోజులు పెంచే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీడి ఎల్.రాంబాబు, ఏపీవోలు ప్రకాష్, రెడ్డి బాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

వికలాంగ బ్యాక్‌లాగ్ పోస్టుల మెరిట్ జాబితా సిద్ధం

ప్రజాశక్తి పాడేరు : వికలాంగ బ్యాక్‌లాగ్ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి ఉమ్మడి విశాఖలో 2021-22లో జారీచేసిన నోటిఫికేషన్ ఆధారంగా ఏడు ఉద్యోగాల భర్తీకి అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ జాబితా సిద్ధమైందని జిల్లా పౌరసరఫరాల శాఖ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. అభ్యర్థులకు సమాచారం కోసం https://Visakhapatnam.ap.gov.inలో వివరాలు పొందుపరిచినట్లు వెల్లడించారు. ఉద్యోగ తరగతి, వైకల్యం ఆధారంగా మెరిట్ జాబితాలతోపాటు సవరించిన, తిరస్కరించిన దరఖాస్తులు వివరాలు జాబితాఉన్నాయన్నారు. జాబితాల పరిశీలన అనంతరం, దీనిపై సహేతుకమైన అభ్యంతరాలుంటే ఈనెల 22లోగా రాతపూర్వకంగా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వద్ధుల సంక్షేమ శాఖ, విశాఖపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. గడువు దాటిన అభ్యంతరాలను స్వీకరించబడవన్నారు. మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థుల అన్ని అర్హతలు పరిశీలించి ప్రకటించిన ఖాళీల మేరకు, నిబంధనల ఆదారంగా తుది జాబితా ఎంపిక పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఈ విషయంలో బయట వ్యక్తులు, దళారులు మోసపూరిత చర్యలకు ఎవరూ గురికావద్దని సూచించారు.

పగలంతా భానుడు.. సాయంత్రం వరుణుడు

- ఎండ వేడి, ఉక్కబోతతో జనం విలవిల
- సాయంత్రం కుండపోత వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో మంగళవారం పగలంతా భానుడు భగభగ మండిపోగా, సాయంత్రానికి వరుణుడు తన ప్రతాపాన్ని చూపాడు. నాలుగైదు రోజుల నుంచి అడపా దడప సీలేరు పరిసర ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నప్పటికీ ఉష్ణోగ్రతలు పెద్దగా తగ్గకపోగా, మంగళవారం ఉదయం నుంచి భానుడు భగభగ మండిపోవడంతో మధ్యాహ్నం సమయానికి 38 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వచ్చేందుకు సాహసించడం లేదు. ఏదైనా పని ఉంటే గొడుగు వేసుకొని బయటకొచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే రకంగా ఎండకాయడంతో ఎండ వేడి అధికంగా ఉంది. దీనికి ఉక్కబోత తోడు కావడంతో ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు విలవిలలాడిపోయారు. కొంత మంది ప్రకృతి ఒడిలో పచ్చని చెట్ల కింద సేద తీరగా, మరికొంత మంది ప్రజలు ఏసీలు కూలర్లు వేసుకొని ఇళ్లకే పరిమితమయ్యారు.



మండుటెండలో గొడుగు నీడలో చిన్నారిని తీసుకొని వెళ్తున్న మహిళ


సీలేరులో కురుస్తున్న వర్షం

కుండపోత వర్షం

ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపగా, సాయంత్రం ఐదు గంటల తర్వాత వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమై భారీ ఈదురుగాలులు, ఉరుములతో సాయంత్రం 6.40 నుండి కుండపోత వర్షం కురిసింది. మునుపెన్నడు లేనివిధంగా ఒక్కసారిగా కుంభవృష్టి వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో వీధులన్నీ జలమయమయ్యాయి. రాత్రి 7.30 వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో సీలేరు పరిసర ప్రాంతాలో చల్లటి వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే మంగళవారం నుంచి అగ్నికరితలు ప్రారంభం కావడంతో రానున్న రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలతో పాటు వడగాలలు వీసే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన అన్నసమారాధన


అన్నసమారాధనలో పాల్గొన్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి- హుకుంపేట : మండలంలో మోదకొండమ్మ ఉత్సవాల ముగింపురోజున ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులకు పులిహోరా, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు.. అనంతరం స్థానిక గ్రీష్మ మెడికల్ షాప్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్‌ను స్థానిక తహశీల్దార్ రాజ్యలక్ష్మి ఎపిటిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు సూర్యారావు, స్థానిక సర్పంచ్ వెంకట పూర్ణిమ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సమాజంలోని సమస్యల పరిష్కారానికి తమ కలంతో కృషిచేస్తున్న పాత్రికేయులు, ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అన్నసమారాధన నిర్వహించిన ప్రెస్‌క్లబ్, పత్రికా ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ జి రంగారావు. సర్పంచ్ వెంకటాపూర్ణిమ, గిరిజన విలేకరుల సేవా సంఘం జిల్లా అధ్యక్షులు సూర్యారావు, కార్యవర్గ సభ్యులు సునీల్‌కుమార్, మత్స్యలింగం, జోషి, దుర్గా, రామంచందర్, రాజారావు, మోహన్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: శాఖ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 30 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లైబ్రేరియన్ ఎస్ సునీత ,సిబ్బంది కె.సుబ్బారావు, ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు.

నిర్ణీత గడువులోపు భూముల రీ సర్వే పూర్తి

అధికారులను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

ప్రజాశక్తి - రంపచోడవరం. : జిల్లాలోని భూ హక్కు భూ రక్ష పథకం ద్వారా నిర్ణీత గడువు లోగా భూముల రీ సర్వే పూర్తి చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరేతో కలిసి అన్ని మండలాలకు సంబంధించిన సర్వే అధికారులు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, విఆర్ఒలతో రీసెర్వేపై జెసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి శివ శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వే ప్రారంభించిన రోజు నుండి 100 రోజులలో ప్రభుత్వ నిబంధన ప్రకారం రీ సర్వే పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు 100 గ్రామాలలో పూర్తిస్థాయి రీ సర్వే చేయడం జరిగిందని తెలిపారు. డివిజన్లోని అన్ని మండలాలలో ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో రీసర్వే ప్రారంభించారో, దాని పురోగతి ఏమిటో మండలాల వారీగా సమీక్ష చేశారు. ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి రీ సర్వే ప్రగతిపై చర్చించుకోవాలని సూచించారు. సర్వే సందర్భంగా రైతుల పేర్లు తప్పులు లేకుండా ఎప్పటికప్పుడు అప్లోడ్ చేసే బాధ్యత సంబంధిత తహశీల్దార్లపై ఉందని చెప్పారు. ఈ సర్వేకు సంబంధించిన ఫారంలో 34 రకాల విధివిధానాలు ఉన్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ఫారం నింపాలని సూచించారు. రికార్డుల ప్రకారం రైతుల పేర్లు తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఉమ్మడి భూములు ఉంటే ముటేషన్ కూడా చేయాలని సూచించారు. సర్వేకి ముందు రైతులకు నోటీసులు ఇవ్వాలని, అభ్యంతరాలు ఏమైనా ఉంటే మళ్లీ సర్వే చేయవచ్చుని చెప్పారు. ఆయా గ్రామాల్లోని గ్రామ పెద్దలకు తమ గ్రామంలోని భూములకు సంబంధించిన వివరాలు తెలుస్తాయని, ఆయా గ్రామాల పెద్దలతో కూడా రీ సర్వేపై సంప్రదించవచ్చుని పేర్కొన్నారు. ఆరు రకాలైన అంశాలతో పర్సనల్ రిజిస్టర్ మీటింగ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రాజశేఖర్, తహశీల్దార్లు తాతారావు, శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ, సిహెచ్ శ్రీనివాసరావు, సుబ్రమణ్యం, డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జెసి శివ శ్రీనివాస్, హాజరైన రెవెన్యూ అధికారులు, సిబ్బంది



స్టీల్‌గ్లాస్‌లు ఇస్తున్న జెవికె బృంద సభ్యులు

186 పాఠశాలలకు స్టీల్ గ్లాసుల పంపిణీ

ప్రజాశక్తి -జి.మాడుగుల: జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో పాఠశాలల్లోని విద్యార్థులు రాగి జావ తాగేందుకు వీలుగా 186 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు జెవికె-4 బృంద సభ్యులు మంగళవారం స్టీల్‌గ్లాస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెవికె-4 సభ్యులు, ఎంపిడిఒ చంద్రశేఖరరావు, వెలుగు ఎపిఎం సుందరమ్మ, ఎంఐసి వెంకటరమణ, సిఆర్‌పిలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షరభారత్ కో-ఆర్డినేటర్లకు ఉద్యోగావకాశం కల్పించాలి

ప్రజాశక్తి -హుకుంపేట: సాక్షరభారత్, వయోజన విద్యావిభాగంలో గ్రామ సమన్వయకర్తలుగా పనిచేసిన వారందరికీ ఉద్యోగ అవకాశం కల్పించాలని సాక్షరభారత్ విసిల యూనియన్ అల్లూరి జిల్లా కమిటి సభ్యులు కె శ్రీనుబాబు, కె నూకరాజు, వి వనజ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి హయాంలో 19,502 మంది సాక్షరభారత్ ఉద్యోగులను తొలగించారన్నారు.అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు లక్షల మందికి ఉద్యోగావకాశాలను కల్పిస్తామని మాటిచ్చి, కేవలం 502 మంది మండల సమన్వయకర్తలకే సిఎం జగన్ ప్రభుత్వం ఛాన్స్ ఇవ్వడం విచారకరమన్నారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు తొలగించిన సాక్షరభారత్ మండల, గ్రామ కోఆర్డినేటర్లందరకీ ఉద్యోగాకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 10న జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టి, కలెక్టరేట్‌లో వినతిపత్రం అందిస్తామన్నారు. ఏజెన్సీలోని 11మండలాల సాక్షరభారత్ సమన్వయకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -పాయకరావుపేట: పాయకరావుపేట నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైందని ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యదర్శి బి ఈశ్వరరావు తెలిపారు. మంగళవారం పాయకరావుపేటలోని ద్వారక హోటల్‌లో మాజీ అధ్యక్షుడు ముత్తా గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, సంఘ బలోపేతానికి మరింత కృషి చేయాలని జిల్లా కార్యదర్శి ఈశ్వర్రావు పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాయకరావుపేట నియొజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా పినపాత్రుని రామం, ఉపాధ్యక్షులుగా మొల్లేటి వీరవెంకటలక్ష్మీ కుమారి, కార్యదర్శిగా కీర్తి కన్నబాబు, సహాయ కార్యదర్శిగా గింజాల వెంకటరమణ, కోశాధికారిగా మురుకుర్తి శ్రీనువాసరావు, సభ్యులుగా వంగలపూడి మధుబాబు, పడాల ఈశ్వరరావు, పసగడుగుల శేఖర్, సాధు వరప్రసాద్ ఎంపికయ్యారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి -కోటవురట్ల: రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని తహశీల్దారు జానకమ్మ సూచించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సమస్యల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు, ప్రధానంగా సమగ్ర భూరక్ష భూసర్వే పథకం అమలులో నిర్లక్ష్యంపై మండిపడ్డారు.

అదేవిధంగా స్పందనలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత గృహ హక్కు పత్రాలు అర్హత కలిగిన వారందరికీ అదే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో వారికి ధ్రువపత్రాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఉర్ధవరావు, సీనియర్ అసిస్టెంట్ గణపతిరావు, విఆర్ఒల సంఘ అధ్యక్షులు రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఆలయం చెంత అపారిశుధ్యం!

ఆవేదన చెందుతున్న భక్తులు, ప్రజలు

ప్రజాశక్తి -ఎస్.రాయవరం : మండలలో ధర్మవరం అగ్రహారం శ్రీదుర్గాదేవి గుడికి ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో పెద్ద ఎత్తున చెత్తచెదారాన్ని వేస్తుండడంపై పలువురు ఆవేదన చెందుతున్నారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మంగళవారం సోషల్ మీడియా ద్వారా దుర్గగుడి వద్ద అపారిశుధ్యంపై ఎంపిడిఒ స్పందించాలంటూ పోస్టు పెట్టి విన్నవించారు

మండల కేంద్రానికి వెళ్లే జాతీయ రహదారి నుంచి శ్రీ దుర్గా దేవి గుడి వరకు రోడ్డుపొడుగునా పెద్ద ఎత్తున చెత్తాచెదారం పేరుకుపోవడంతోపాటు కొత్తగా నిర్మించిన పక్క కాలువలోను, అలాగే గ్రామంలో అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చెత్తచెదారం పేరుకుపోయి ఉందని పలువురు ఆవేదన చెందుతున్నారన్నారు. క్షీణించిన పారిశుధ్యం, దుర్గంధంతో ప్రజలు అనునిత్యం అవస్థలు పడుతుండడమే కాకుండా, పవిత్రంగా ఉండాల్సిన ఆలయ పరిసరాల్లోనూ చెత్త నిండుకుంటుండడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. అంతేకాక అపారిశుధ్యంతో ఈగలు, దోమలు విజృంభించి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. ఎంపిడిఒ వెంటనే స్పందించి, ధర్మవరం అగ్రహారంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు తగు చర్యలు చేపట్టాలని వేడుకున్నారు.

చెరువులోని ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోట గ్రామ సమీపంలో నాయుడు చెరువు ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. గ్రామానికి చెందిన ఎంపిటిసి సభ్యులు, పూడి దేవ గత నెల 20న స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ మహేశ్వరరావు ఆదేశాలతో మంగళవారం సర్వే నెంబర్ 227లోని స్థానిక నాయుడు చెరువులో ఆక్రమణలను గుర్తించారు. సుమారు మూడు ఎకరాల మేర అక్రమణకు గురైనట్టు గుర్తించారు. సరిహద్దులు వేసి ఆక్రమణలను తొలగించారు.

ఈ సందర్భంగా ఎంపిటిసి పూడి దేవ మాట్లాడుతూ ఆయుకట్టుదారుల వినతి మేరకు చెరువును అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే ప్రణాళికను సంబంధిత అధికారులు సిద్ధం చేశారన్నారు. రూ 10 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో చెరువును అభివృద్ధి చేయనున్నారని, ఆక్రమణదారులు సహకరించాలని కోరారు. సర్వేలో విఆర్ఒ లక్ష్మి, లైసెన్స్ సర్వేయర్ శ్రీరామూర్తి, విఆర్ఎ మధు పాల్గొన్నారు.

సిఎం కప్ గోల్డ్ మెడల్ సాధించిన..

మౌనిక, కృష్ణవేణిలకు సత్కారం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : సిఎం కప్ గోల్డ్ మెడల్ సాధించిన నర్సీపట్నానికి చెందిన బొంతు మౌనిక, కృష్ణవేణిలను మంగళవారం నర్సీపట్నం డిఎస్‌పి ప్రవీణ్‌కుమార్, టౌన్ సిఐ నమ్మి గణేష్ అభినందించి, సత్కరించారు. ఎన్‌టిఆర్ స్టేడియంలో నింజాస్ అకాడమీ నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను సందర్శించి, అక్కడి శిక్షణార్థుల బాక్సింగ్, కరాటే, నాన్‌చాక్ విన్యాసాలను తిలకించారు. క్రీడాకారులకు రొట్టెలు, కేక్‌లు, బిస్కెట్లు అందించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడల వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. శారీరక, మానసిక దృఢత్వంతోపాటు జ్ఞాపకశక్తికి దోహదపడడంతోపాటు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రత్యేక ప్రోత్సాహకాలుంటాయన్నారు. పట్టణ సిఐ గణేష్, స్పోర్ట్స్ కోటాలోనే ఉద్యోగాన్ని సంపాదించారన్నారు. క్రైమ్ పోలీసు, బిల్డర్ శ్రీను తమ శాఖ తరపున క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని అందించారు.కార్యక్రమంలో డైరెక్టర్స్ వెలగా నారాయణరావు, పారుపల్లి శ్రీనివాసరావు, వెలగా జగన్నాథం, బోళెం శివ, వూషు కోచ్ శేఖర్, శాప్ కోచ్ ఆబ్బు పాల్గొన్నారు.



బెస్ట్ ఉమెన్ ఫ్యాకల్టీగా జ్యోతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు సిహెచ్ జ్యోతి 'ది బెస్ట్ ఉమెన్ ఫ్యాకల్టీ' అవార్డుకు ఎంపికయ్యారు. ఏటా వివిధ రంగాల్లో సేవ, నైపుణ్యం, ప్రతిభ ఆధారంగా ఎంపిక విధానం ఉంటుంది. తమిళనాడుకు చెందిన చెన్నై గ్రాబ్స్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఏప్రిల్ 30న ఈ అవార్డును ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. అవార్డు గ్రహీత జ్యోతిని ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొత్తకోట : ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద వైశ్య కుటుంబానికి కొత్తకోటకు చెందిన న్యూ వాసవి క్లబ్ సభ్యులు రూ.29,200 నగదు సాయం మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన పడమటి నరసింహమూర్తి ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి స్థానిక న్యూవాసవి క్లబ్ తరపున ఆర్థికసాయం అందించి బాసటగా నిలిచారు.

కార్యక్రమంలో న్యూవాసవి క్లబ్ అధ్యక్షులు, సెక్రెటరీ, ట్రెజరర్, సభ్యులు కామేష్, గురుమూర్తి, సంతోష్ కుమార్, రాజేష్, పెంటపాటి అశోక్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



గంజాయితో పట్టుబడిన నిందితులు

8 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలోని ప్రభుత్వం జూనియర్ కాలేజీ జంక్షన్ వద్ద మెయిన్ రోడ్డులో మంగళవారం స్థానిక పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఒడిశా నుంచి అనంతగిరి మీదుగా విశాఖ మైదాన ప్రాంతానికి రెండు స్కూటీలలో తరలిస్తున్న ఎనిమిది కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విశాఖకు చెందిన నిందితులు సూరిశెట్టి అజయ్, ప్రవరాఖ్య, కర్రి దీపక్ శ్రీను, గొర్లె డానియల్ రాజ్, చిన్ని సుమంత్‌లను అరకు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రాము తెలిపారు.

మేఘాద్రిలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పెందుర్తి : మేఘాద్రి రిజర్వాయర్‌లో మంగళవారం మృతదేహం లభ్యమైంది. డాము వద్ద ఉన్న ఆధార్, బండి నెంబర్ ఆధారంగా స్థానికులు అతన్ని బాజీ జంక్షన్ ప్రాంతానికి చెందిన యాగటి హేమంత్ కుమార్ (38)గా గుర్తించి ఇంటికి సమాచారం అందించారు. భార్య భారతి పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పరిశీలించారు. కుటుంబ గొడవలతో భార్య పుట్టింటికి వెళ్ళిపోయిందని ఆత్మ చేసుకున్నాడా, లేక కాలు జారి పడిపోయాడా అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గొలుగొండ : మేజర్ పంచాయతీ ఏఎల్ పురానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యం మానేయమని భార్య మందలించిందని మనస్థాపంతో గడ్డిమందు తాగి ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఈ మేరకు కేడీపేట ఎస్ఐ ఉపేంద్ర తెలిపిన వివరాలివి. స్థానిక హైస్కూల్ వెనుక బిసి కాలనీలో నివాసముంటున్న సరుకుండు మర్నిబాబు (49) మద్యానికి బానిసై,. అనారోగ్యం బారిన పడ్డారు. మరోవైపు రెండవ కుమార్తె వివాహం దగ్గరపడడంతో మద్యం తాగడం మానేయమని భార్య సత్యవతి తరచూ మందలించేది. దీంతో మనస్థాపానికి గురైన మర్నిబాబు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కేడి పేట పిహెచ్‌సికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కెజిహెచ్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి మరణించాడు. కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్‌టిసి బస్ డ్రైవర్ హఠాన్మరణం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్‌టిసి డ్రైవర్ డి.ఎ.రావు మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. నర్సీపట్నం ఆర్‌టిసి డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆయన, మంగళవారం ఉదయం డిపోకు వచ్చి, తన ఆరోగ్యం బాగాలేదని, అస్వస్థతగా ఉన్నందున సెలవు ఇవ్వాలని అభ్యర్థించి సెలవు పెట్టారు. చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా, అక్కడ వైద్యులు పరీక్షించేలోగానే కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఆర్‌టిసి డ్రైవర్ డి.ఎ.రావు హఠాన్మరణంపై కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండగా, తోటి ఉద్యోగులు విస్మయానికి గురై, సంతాపం వ్యక్తం చేశారు.

మాజీ సర్పంచ్ రమణ మృతి

ప్రజాశక్తి-మాడుగుల : మాడుగుల ప్రస్తుత ఎంపిపి వేమవరపు రామధర్మజ (పెదబాబు) తండ్రి, వైసిపి నేత, మాడుగుల మాజీ సర్పంచ్ వేమవరపు వెంకటరమణ(ఎస్‌పిఎల్ రమణ) మంగళవారం మృతి చెందారు. కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన మంగళవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. చిన్నతనంలో మాడుగుల హైస్కూల్‌లో ఎస్‌పిఎల్‌గా వ్యవహరించడంతో,. అనాటి నుండి ఎస్‌పిఎల్ రమణగానే పేరు పొందారు.



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సుశీల

నర్సింగ్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నర్సింగ్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని ఆంధ్రప్రదేశ్ నర్సెస్, మిడ్‌వైవ్స్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఆచార్య కె.సుశీల అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఇంటర్నేషనల్ నర్సెస్ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా ఎయు స్నాతకోత్సవ మందిరంలో నిర్వహిస్తున్న క్రీడా, సాంస్కృతిక పోటీల కార్యక్రమాల ముగింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఎంతో ప్రత్యేకతను, గుర్తింపును, గౌరవాన్ని కలిగిన వృత్తుల్లో ఒకటిగా ఇది నిలుస్తుందన్నారు. వ్యక్తి ప్రాణాలను రక్షించే వైద్యులకు సహాయకారిగా, వైద్య వ్యవస్థలో ప్రధాన అంగంగా నర్సింగ్ వ్యవస్థ దశాబ్దాలుగా నిలుస్తోందన్నారు. ఫ్లోరెన్స్ నైటేంగేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ వృత్తిలో విశిష్ట గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

మంగళవారం ఉదయం రెండో రోజు కార్యక్రమాలను జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. ఫ్లోరెన్స్ నైటేంగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. విపత్కర సమయాలలో సైతం నర్సింగ్ సిబ్బంది అపూర్వ సేవలు అందించి దేశ ప్రజల మన్ననలు పొందారన్నారు. భారత దేశం కోవిడ్ మహమ్మారి నుంచి సురక్షితంగా బయటపడటంలో నర్సింగ్ సిబ్బంది సేవలు విలువైనవన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎపిఎన్ఐఎంఎ అధ్యక్షురాలు డాక్టర్ సునీత రెడ్డి, కార్యదర్శి పి.సునీల్, కోశాధికారి లక్ష్మీ నరసింహం, సమన్వయకర్త ఎం.ప్రీతం లూక్ పాల్గొన్నారు.

తప్పుడు ఫిర్యాదులను నమ్మొద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఫార్మాసిటీ నిర్వాసిత గ్రామాలకు చెందిన అసలైన లబ్ధిదారుల ఇళ్లలో మేజర్లు అయినవారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, దీనిపై కొందరు చేస్తున్న తప్పుడు ఫిర్యాదులను, కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తలను నమ్మొద్దని కోరుతూ ఫార్మాసిటీ నిర్వాసిత గ్రామాల ప్రజలు మంగళవారం కలెక్టర్‌ను కోరారు. వారంతా కలెక్టరేట్ ఆవరణలో తొలుత నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 2004లో అప్పటి ప్రభుత్వం ఫార్మాసిటీ నిర్మాణం కోసం పరవాడ మండలం లేమర్తి, ఈదులపాక బోనంగి, కొత్తపాలెం, పొన్నూరు అగ్రహారం, పాలకాలపేట, దొప్పవారిపాలెం, ఎదురువానిపాలెం గ్రామాలకు చెందిన భూములను, నివాస గృహాలను ప్రజల అంగీకారం మేరకు సర్వే చేసి భూములను, ఇళ్లను 2007లో తీసుకొని నిర్వాసితులందరికీ నష్టపరిహారం చెల్లించారని తెలిపారు. అదే సందర్భంలో నిర్వసితులందరికీ అగనంపూడి వద్ద ఇళ్ల స్థలాలను కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇచ్చారని తెలిపారు. అంతేకాకుండా నిర్వాసితులలో ఇంటికి ఒకరు చొప్పున మేజర్ అయిన వారికి కూడా ఇళ్ల స్థలాలను ఇవ్వాలని అప్పట్లో కోరగా ప్రభుత్వం అంగీకరించిందన్నారు. కానీ ఆ తరువాత కాలంలో ప్రభుత్వం మేజర్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. దీనిపై తాము కోర్టును ఆశ్రయించగా కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు.

కెజిహెచ్‌కు అండగా దాతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సింహాద్రి టిఎంటి, హిమ హ్యూమానిటేరియన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కెజిహెచ్‌కు లక్షల విలువైన బిపి ఆపరేటర్లను విరాళంగా అందజేశారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్, ఎఆర్ఎమ్ డాక్టర్ అరుణాదేవి వీటిని స్వీకరించారు. ఈ సందర్భంగా హిమ హ్యూమానిటేరియన్ వ్యవస్థాపకులు టివిడి.దాస్ అధ్యక్షతన సభ జరిగింది.

గంజాయి అక్రమ రవాణాపై కొరడా



సమావేశంలో పాల్గొన్న విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ, సిపి త్రివిక్రమ్ వర్మ, పలువురు ఎస్‌పిలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఒడిశా కేంద్రంగా సాగుతున్న గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ముమ్మర చర్యలు చేపట్టనున్నట్టు విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ తెలిపారు. విశాఖ నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్‌పిలతో ఆయన మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి, కోరాపుట్ జిల్లాల కేంద్రంగా గంజాయి రవాణా సాగుతోందని, అది విశాఖ మీదుగా ఈశాన్య రాష్ట్రాలకు చేరుతోందని అన్నారు. ఆపరేషన్ పరివర్తన్ పేరుతో అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత ఏడాది 7570 ఎకరాల గంజాయి సాగును నాశనం చేశామని, ఈ ఏడాది ఇప్పటికే 1039 ఎకరాల్లో గంజాయి పంటను నాశనం చేశామని, గత ఏడాదితో పోల్చుకుంటే గంజాయి సాగును భారీగా నివారించగలిగామని తెలిపారు అంతేగాకుండా ఆరు జిల్లాలలో గంజాయి రవాణాపై పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో చెక్ పోస్టులు నెలకొల్పామని, అవసరాన్ని బట్టి మరిన్ని చెక్‌పోస్టులు పెట్టి గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా నియంత్రిస్తామని అన్నారు.

విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ సిఎం త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో గత ఏడాది గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి 255 కేసులు నమోదు చేసి 332 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. 6200 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని నాశనం చేశామని, 85 వాహనాలను సీజ్ చేశామని ఆయన తెలిపారు. అంతేగాకుండా అనుమానిత వ్యక్తులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాల్సిందిగా నగరంలో ఉన్న 510 హోటళ్లకు నోటీసులు అందించామని అన్నారు. నగరంలో 165 లారీ ట్రాన్స్‌పోర్టు సంస్థలు ఉండగా అందులో 130 లారీ ట్రాన్స్‌పోర్టు సంస్థలకు నోటీసులు ఇచ్చామని, వారితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. ఒక ట్రాన్స్‌పోర్టు సంస్థ ఇచ్చిన సమాచారం మేరకు ఇప్పటికే 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన మార్పు కౌన్సిలింగ్ సెంటర్ ద్వారా 550 మందికి కౌన్సిలింగ్ ఇచ్చి వారిలో మార్పు తీసుకు రాగలిగామని తెలిపారు.

అనకాపల్లి ఎస్‌పి కెవి.మురళీకృష్ణ మాట్లాడుతూ 224 కేసులు నమోదు చేశామని 521 మందిని అరెస్ట్ చేశామని వెల్లడించారు. 21,571 కేజీల గంజాయి నాశనం చేసామని, 141 వాహనాలను సీజ్ చేసామని తెలిపారు. 136 ప్రాంతాల్లో మారక దవ్యాల నిరోధక అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. శ్రీకాకుళం ఎస్‌పి జిఆర్.రాధిక మాట్లాడుతూ ఒడిశా సరిహద్దు తమ ప్రాంతానికి దగ్గరగా ఉండటం వల్ల మరింత అప్రమత్తంగా ఉన్నామని, రెండుచోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. స్ఫూర్తి కార్యక్రమంతో పోలీసు బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విజయనగరం ఎస్‌పి ఎం.దీపిక మాట్లాడుతూ ఇప్పటి వరకూ 2023లో 19 కేసులు నమోదు చేసి 46 మందిని అరెస్ట్ చేసామని, 12 చెక్ పోస్టులు ఏర్పాటు చేసామని, విజయనగరం రైల్వే స్టేషన్‌లో శాశ్వత ప్రాతిపదికన ఒక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ గంజాయి సాగును నివారించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ తమ జిల్లాలో ఒడిశాది కొంత సరిహద్దు ఉన్నందున నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.

ప్రభుత్వ వైఫల్యానికి విద్యార్థులు మూల్యం

జెడ్‌పిల్లో దిగజారిన పది ఫలితాలు
మేడిచర్లలో జీరో ఫలితం
ఉపాధ్యాయుల కొరతే కారణం
పరీక్షలకు ముందు పలువురికి స్థాన చలనం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఈ ఏడాది సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పది ఫలితాలపై పడింది. సబ్జెక్టు టీచర్లను భర్తీచేయకుండా సీనియర్ సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించి పాఠ్యాంశాల బోధన బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. మరోవైపు పదో తరగతి పరీక్షలకు ముందు ఫిబ్రవరిలో పది విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులను రేషనలైజేషన్ పేరుతో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేసింది. పరీక్షలకు ముందు ఉపాధ్యాయులను ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు పంపించకూడదన్న ప్రాథమిక విద్యా సూత్రాన్ని పక్కనపెట్టి స్థాన చలనం చేసింది. ప్రమోషన్లు పొందిన సీనియర్ సెకెండరీ గ్రేడ్ టీచర్లకు సబ్జెక్టుపై పూర్తిస్థాయి బోధనానుభవం లేకుండానే తరగతులను విద్యాశాఖాధికారులు కేటాయించారు. ప్రభుత్వ తప్పిదాలే జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో పది ఫలితాలు పడిపోవడానికి దారితీశాయి.

జిల్లాలోని 203 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 13,367 మంది పరీక్షలకు హాజరుకాగా వీరిలో 9,461 మంది పాసయ్యారు. 3,906 మంది ఫెయిలయ్యారు. ఐదు జెడ్‌పి పాఠశాలల్లో శత శాతం ఉత్తీర్ణులయ్యారు. చీడికాడ మండలంలోని బైలపూడి జెడ్‌పి పాఠశాలలో 26 మంది, దేవరాపల్లి మండలంలో వేచలంలో 27 మంది, అలమండ కొత్తపల్లిలో 26 మంది, ముషిడిపల్లిలో ఏడుగురు, కాలిగొట్లలో 15 మంది పరీక్షలకు హాజరుకాగా అందరూ పాసయ్యారు. కె.కోటపాడు మండలం మేడిచర్ల జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పరీక్షలకు హాజరైన ఇద్దరూ ఫెయిలయ్యారు. 11 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత ఒక పాఠశాలలో వచ్చింది. ఫెయిలైన 3,906 మంది విద్యార్థుల్లో ఒక సబ్జెక్టులో 902 మంది, రెండు సబ్జెక్టుల్లో 905 మంది, మూడు సబ్జెక్టుల్లో 538 మంది, నాలుగు సబ్జెక్టుల్లో 311 మంది, ఐదు సబ్జెక్టుల్లో 165 మంది, ఆరు సబ్జెక్టుల్లో 85 మంది ఉన్నారు.



ఏర్పాట్లును పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో ఈ నెల 11న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు, బ్యానర్లు లేకుండా చర్యలు చేపట్టాలని, సెంటర్ మీడియన్లలో పిచ్చి మొక్కలను తీసివేసి అందంగా తీర్చిదిద్దాలని అధికారులను జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. మంగళవారం ఆయన ప్రధాన ఇంజినీర్ రవికృష్ణ రాజు, అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్ కుమార్‌లతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను, రోడ్ల పరిశుభ్రతను పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరంలోని పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం, ఆరిలోవ అపోలో హాస్పిటల్, బీచ్ రోడ్డులోని సీ హారియర్ మ్యూజియం ప్రాంతాల్లో సిఎం పర్యటన ఉంటుందని, ఆయా చోట్ల అనధికారికంగా ప్రదర్శించిన బ్యానర్లను తొలగించాలని సిసిపిలకు ఆదేశించారు. పారిశుధ్య పనులు సక్రమంగా సాగాలన్నారు. విద్యుత్ దీపాలను పరిశీలించాలని, రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధాన ఇంజినీర్ రవికృష్ణ రాజుకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు పాల్గొన్నారు.



కారుణ్య నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

కారుణ్య నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగులు నిజాయితీగా, నిస్వార్థంగా అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు మంగళవారం సాయంత్రం ఆయన కారుణ్య నియామకాల ఉత్తర్వులను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అందజేశారు. విశాఖపట్నం జిల్లాలో 40 మంది జూనియర్ అసిస్టెంట్లు, 5 ఆఫీస్ సబార్డినేట్లు వెరసి 45 పోస్టులను కారుణ్య నియామకం కింద చేపట్టినట్లు వెల్లడించారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈరోజు ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో కలిపి 244 మందికి నియామక పత్రాలు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఉద్యోగంలో చేరిన తరువాత కూడా ఉన్నత విద్యనభ్యసించాలని ఆకాంక్షించారు. నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వారందరూ నిస్వార్థంగా, నిష్పక్షపాతంగా, నిజాయితీగా తమ విధులను నిర్వహించాలన్నారు. ఉద్యోగం పొందిన ప్రతి అభ్యర్థి చేసే పనిలో నైపుణ్యత, నాలెడ్జ్, అవగాహన కలిగి ఉంటే ఉన్నత స్థితికి చేరుకోవచ్చునని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది వేచి చూస్తున్నారని, క్లిష్ట సమయంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని అన్నారు.